క్లుప్తంగా

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



సీతారాముల గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో రెండ్రోజులుగా జరుగుతున్న కోదండరామ స్వామి ఉత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. చివరి రోజు భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవంతో పాటు వసంతోత్సవం, పార్వేట కార్యక్రమాలు నిర్వహించారు.

గంగాభవాని ఉత్సవాలు ప్రారంభం

మండలంలోని గంగిరెడ్డిపల్లిలో గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నిలుపుతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరించారు. అమ్మవారి చరిత్రను భక్తులకు వివరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ



చిన్నారులకు బ్యాగ్‌లు పంపిణీ చేసిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని వెంకట్రావుపల్లి గిరిజనకాలనీలోని పలువురు చిన్నారులకు పట్టణానికి చెందిన ఎడ్పమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ నిర్వాహకులు 30 మందికి స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఆదివారం సంస్థ నిర్వాహకులు పి.ఎడ్వర్డ్ కాలనీ వద్దకు వెళ్లి అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల ఆవరణలో చిన్నారులను పిలిచి బ్యాగ్‌లు అందజేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



పిల్లలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేస్తున్న లైబ్రేరియన్ కోటేశ్వరమ్మ

అల్లూరు: స్థానిక బాపూజీ పార్కు ఆవరణలోని గ్రంథాలయంలో నెల రోజుల నుంచి జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయని లైబ్రేరియన్ పి.కోటేశ్వరమ్మ తెలిపారు. వివిధ ఆటల్లో విజయం సాధించిన పిల్లలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు.


66 మంది విద్యార్థుల హాజరు



కలిగిరి: మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కలిగిరి: కలిగిరిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షకు 66 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 76 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 66 మంది పరీక్షకు హజరయ్యారన్నారు. ఫలితాలు ఈ వారంలోనే తెలుస్తాయన్నారు. సోమవారం నుంచి పాఠశాల పునః ప్రారంభం అవుతుందన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులకు బిస్కెట్లు అందజేశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మి

జలదంకి: జలదంకి శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. గ్రంథాలయ అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, యోగా తదితరాలపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. వివిధ పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నామన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు, పాఠకులు, గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు.

రైతు కుశలం

విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఏటా వెంపర్లాట. ప్రభుత్వం సబ్సిడీతో అరకొరగా ఇచ్చే విత్తనాల కోసం రైతులు వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు. విత్తన, ఎరువుల పర్మిట్లు ఇస్తారంటే కి.మీ. క్యూలు. రోజంతా పడిగాపులు. ఇక సబ్సిడీపై ఇచ్చే పనిముట్లకు సైతం రాజకీయ నాయకులతో పైరవీలు. పరపతి ఉన్నోడు.. దొడ్డిదారిన తన్నుకుపోయే పరిస్థితి. విత్తనాలైనా.. ఎరువులైనా.. పనిముట్లు అయినా.. మొక్కుబడిగా అందిన వైనం. ఇదంతా గతం.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రైతుల కష్టాలకు చెల్లు చీటీ పడింది. వ్యవసాయశాఖ అవసరాల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఊర్లోనే ఆర్బీకేలు. అక్కడే ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అవసరమైన రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారు. పార్టీలతో పనిలేకుండా, పైరవీలకు తావు లేకుండా ఆర్బీకేల్లో నమోదు చేసుకుంటే తక్షణమే మంజూరు చేస్తున్న పరిస్థితి. సాగు ప్రారంభం నుంచి పంట దిగుబడి వరకు అన్ని తామై ఆర్బీకే సిబ్బంది క్షేత్రస్థాయిలో నమోదు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యం వస్తే పంట నష్టపోయామనే బాధ లేదు. పరిహారం న్యాయబద్ధంగా అందుతోంది.

- వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో రైతులకు తీరిన చింత
- విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అందిస్తున్న ఆర్బీకేలు
- ప్రభుత్వ పథకాలకూ ఊరుదాటాల్సిన అవసరం లేని పరిస్థితి
- పంట నమోదు నుంచి పంట నష్టం వరకు అన్నీ ఇక్కడే

మర్రిపాడు మండలం పోలిరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రం భవనం





ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): నాలుగేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయాలకు సమాంతరంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు భరోసా కల్పించింది. పచ్చిరొట్ట విత్తనాల నుంచి ఇతర అవసరాల కోసం వరకు మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితిని తీరి పల్లె పట్టున అన్నదాతలకు తోడుగా నిలుస్తున్నాయి. సాగుదారు ప్రతి అవసరాన్ని తీరుస్తున్నాయి. విత్తనాల కోసం, ఎరువుల కోసం కి.మీ. గంటల తరబడి క్యూలైన్ల నిలబడాల్సిన అవస్థలు తప్పాయి. ఆర్బీకేల్లోనే అందుతుండడంతో రవాణా ఖర్చులు తగ్గాయి. ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్‌టీవీ, డిజిటల్ లైబ్రరీ, సీడ్, సాయిల్ టెస్టింగ్ కిట్స్, కియోస్క్‌లు రైతుల అవసరాలను తీరుస్తూ వారి నైపుణ్యాన్ని పెంచుతున్నాయి. శాఖల వారీగా తెస్తున్న మాస పత్రికలు రైతుల ఆదరణ చూరగొంటున్నాయి. ఆదర్శ రైతులతో ఏర్పాటైన వ్యవసాయ సలహా మండళ్లు ఆర్బీకేల ద్వారా రైతులకు సలహాలు ఇస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రతీ ఆర్బీకేలో ఏటీఎం సేవలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సాగు ప్రారంభం నుంచి పంట దిగుబడి, విక్రయం వరకు ఆర్బీకేల ద్వారానే జరుగుతున్నాయి.

ఈ క్రాప్ నమోదుతో మేలు

రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుక్ చేసుకునే విధానం వల్ల వారికి బహుముఖ సేవలు అందుతున్నాయి. ప్రకృతి విపత్తులు, తదితర కారణా వల్ల పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందే అవకాశం కూడా ఉంది. ఈ క్రాప్ బుకింగ్ వల్ల రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు మార్గం సులభం అయింది. దీంతో పాటు గతంలో ప్రతి అవసరానికి మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేకుండా తమ సొంత గ్రామంలోనే అనుకూలమైన సమయంలో సేవలు పొందడం రైతులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది.

48 గంటల్లోనే విత్తనాలు, ఎరువులు

రైతు భరోసా కేంద్రాల్లో సమకూర్చిన కియోస్కో యంత్రాలతో రైతులు స్వయంగా తమకు అవసరమైన మేరకు సబ్సిడీ ఎరువులు, విత్తనాలను నమోదు చేసి 48 గంటల్లోనే నేరుగా తమ గ్రామానికి తెప్పించుకోగలుగుతున్నారు. ప్రభుత్వం నుంచి వ్యవసాయ సీజన్లకు అనుగుణంగా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేస్తోంది. రైతు సంఘాలను ఏర్పాటు చేసి వ్యవసాయ యంత్ర పరికరాలను మర్రిపాడు మండలంలో 90 మంది రైతులకు అందించడం విశేషం.

ఆర్బీకేల అండగా..

రైతు భరోసా కేంద్రాల పంట సాగుకు పెట్టుబడి నుంచి విత్తనాలు, ఎరువులు, పనిముట్లు ఏది కావాలంటే అది నమోదు చేసుకున్న వెంటనే పుష్కలంగా అందిస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాలతో పంటల సాగును పండగగా చేపట్టి రైతు కుటుంబాలు కులాసాగా ఉన్నారు. వరుసగా నాలుగేళ్లు సమృద్ధిగా వర్షాలు పడడంతో గతంలో బీళ్లుగా ఉన్న పొలాలు సైతం సాగులోకి వచ్చాయి. మర్రిపాడు మండలంలో ప్రధానంగా సాగు చేస్తున్న వరి, పొగాకు, పచ్చిమిర్చి, బొప్పాయి, పత్తి వంటి పంటలు అధిక దిగుబడులు రావడంతో పాటు గిట్టుబాటు ధరలు కల్పించడంతో రైతులకు సంక్షేమ ఫలాలు అందాయని చెప్పక తప్పదు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ప్రతి సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులు సంతృప్తితో ఉండడం గమనార్హం.

రూ.22.50 లక్షలతో ఆర్బీకే నిర్మాణం

మర్రిపాడు మండలంలో మొత్తం 17 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పడమటినాయుడుపల్లి హైలెవల్ కెనాల్ మునక ప్రాంతం కింద ఉండడంతో నూతన భవన నిర్మాణం జరగలేదు. అల్లంపాడు, ఇర్లపాడు, పల్లవోలు రైతు భరోసా కేంద్రాల భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన 12 భవనాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని రైతులకు సేవలందిస్తున్నాయి. ఒక్కో భవనానికి రూ.22.50 లక్షల వంతున ఖర్చు చేశారు. 16 రైతు భరోసా కేంద్ర భవనాలకు రూ.3.60 కోట్ల నిధులు ప్రభుత్వం ఖర్చు చేసింది.

నాలుగేళ్లలో రైతులకు చేకూరిన లబ్ధి

మండలం	మర్రిపాడు
రైతు భరోసా కేంద్రాలు	- 17
మొత్తం రైతులు	- 10,653
రైతు భరోసా మంజూరైన రైతులు	- 7,506 మంది
నాలుగేళ్లలో రైతులు పొందిన లబ్ధి	- రూ.1,65,13,200
ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు	- 2,736 మంది
వ్యవసాయ పనిముట్లు, యంత్రాల పొందిన రైతులు	- 90
ఉద్యాన పంటలపై సబ్సిడీ పొందిన రైతులు	- 108 మంది
ఉద్యాన పంటల సబ్సిడీ	- రూ.57,20,000

నాలుగేళ్లుగా నిరంతర సేవలు



నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా మాకు నిరంతరాయంగా సేవలు అందుతున్నాయి. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం పెట్టుబడి నిధిగా అందించే రైతు భరోసా నగదు ఎంతగానో ఉపయోగపడుతుంది. విత్తనాలు, ఎరువులు, పనిముట్ల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేకుండా అన్ని మా ఊర్లోనే అందుతున్నాయి.

– మండలవ తిరుపతి, రైతు, పొంగూరుకండ్రిక, మర్రిపాడు మండలం

పంటల సాగుకు సబ్సిడీ ఎరువులు, విత్తనాలు



రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు తర్వాత పంటల సాగుకు అవసరమైన ఎరువులు, సబ్సిడీ విత్తనాలు రైతులకు సకాలంలో అందుబాటులో ఉంచుతున్నారు. అవసరమైన రైతులకు ఇండెంట్ తీసుకొని రెండు రోజుల్లోనే వీటిని సరఫరా చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరల కంటే ప్రభుత్వం ద్వారా పొందే ఎరువులు, విత్తనాలు నాణ్యత మన్నిక కలిగి ఉన్నాయి.

– ఓంకారం శివసాయికుమార్‌రాజు, తిమ్మాయిపాళెం, మర్రిపాడు మండలం



రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

రక్తదానం ప్రాణదానంతో సమానం



పట్టణంలో రక్తదానంపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కావలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షుడు నల్లిపోగు ప్రణీత్ తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాల్లో భాగంగా సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో 2కే వాక్ ఫర్ బ్లడ్ పేరుతో ఆదివారం రక్తదాతల ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం నుంచి శివాజీ విగ్రహం వరకు, తిరిగి మళ్లీ ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి రక్తదానం ప్రాముఖ్యతపై పట్టణ ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రణీత్ మాట్లాడుతూ రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్లు, అత్యవసర వైద్యచికిత్స అవసరమైన సందర్భాల్లో రక్తానికి తీవ్ర కొరత ఏర్పడుతుందని, ప్రజలు రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించుకుని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, సుధీర్‌నాయుడు, ప్రసన్నాంజనేయులు, హరినారపరెడ్డి, స్వర్ణలత, రహీం, రవి కుమార్, టీం సేవియర్స్ సభ్యులు మేఘన, భార్గవ్, ప్రేక్ష, కీర్తి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో, 6, 7 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్లలో చేరేందుకు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శారదా అన్నపూర్ణ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు అడ్మిషన్లు తీసుకోనున్నట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు సరైన ధ్రువపత్రాలతో పాఠశాలకు వచ్చి అడ్మిషన్లు చేయించాలని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఫోన్ ద్వారా తెలిపినట్లు ఆమె తెలిపారు.

తుమ్మాలమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని పాతదేవరాయపల్లిలో తుమ్మాలమ్మకు ఆదివారం పొంగళ్లు పెట్టారు. గ్రామంలోని మహిళలు, భక్తులు మేళతాళాల మధ్య ఊరేగింపుగా పొంగళ్లను తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఉభయకర్తలుగా సీహెచ్ శ్రీనివాసులురెడ్డి వ్యవహరిస్తారు.

పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం నేడు

కావలి: పట్టణంలో పైపులైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం మంచినీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఈ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో తాగునీటిని సరఫరా చేసే జీఆర్పీ పైప్‌లైన్ ఉదయగిరి రోడ్డులోని కరెంట్ ఆఫీస్ వద్ద మరమ్మతులకు గురైందన్నారు. దీంతో పట్టణ పరిధిలో మంచినీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి మంగళవారం నుంచి యథావిధిగా మంచినీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు వివరించారు.

జగనన్నకి చెబుదాం నేడు

కావలి: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై కార్యక్రమంలో అర్జీలు అందజేస్తే త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువగళం యాత్రకు అందరూ సహకరించండి



మాట్లాడుతున్న ఆనం రామనారాయణ రెడ్డి

ఆత్మకూరు: నారా లోకేష్ యువగళం యాత్ర ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఆత్మకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించనుందని, జిల్లాలో తొలిసారిగా ప్రవేశించే పాదయాత్రను జయప్రదం చేసేందుకు అందరూ సహకరించాలని ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు. ఆనం మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు నియోజకవర్గంలో లోకేష్ యాత్ర సాగుతుందన్నారు. చుంచులూరులో 1600 కి.మీ. పాదయాత్ర శిలావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. అనంతసాగరంలో 16వ తేదీ బహిరంగ సభ జరుగుతుందని, అదే రోజు సోమశిల మీదుగా కలువాయి మండలం వెంకటగిరి నియోజకవర్గంలోకి పాదయాత్ర వెళ్లనుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు ఆనం రంగమయూర్‌రెడ్డి, చంద్రారెడ్డి, పులిమి శైలజ, వెంకట సుబ్బానాయుడు, తోడేటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అయితే తొలి నుంచి టీడీపీ పార్టీకి అండగా నిలబడిన గూటూరు మురళీ కన్నబాబు ముఖం చాటేశారు. అత్యవసరంగా విదేశీ పర్యటనకు (తైవాన్) వెళ్లిపోవడంపై సర్వత్రా చర్చించుకున్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

జలదంకి: మండలంలోని చామదల, బ్రాహ్మణక్రాక, జలదంకి గ్రామాల్లోని పోలేరమ్మ తల్లి ఆలయాలలో ఆదివారం గ్రామస్తులు పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మ వారికి నైవేద్యాలు సమర్పించారు. తమ కుటుంబాలకు మంచి జరగాలని కోరుకుంటూ కోడి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



నందవరం ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం నందవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 80 సీట్లు ఖాళీలు ఉండగా, 65 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారని ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. మిగిలిన ఖాళీలను ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా భర్తీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్షలకు సీబీఎస్‌ఈ కో–ఆర్డినేటర్ శ్రీలత, మర్రిపాడు ఎంఈఓ మాలకొండయ్య పరిశీలకులుగా వ్యవహరించారు.

కర్రతుమ్మ చెట్లు తొలగింపు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కర్రతుమ్మ చెట్లను ఆదివారం సర్పంచ్ బోగిరెడ్డి మల్లీశ్వరి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ మార్గంలో చెట్లు దట్టంగా పెరిగి ఉండడం, రహదారిలో ఎక్కువ మలుపులు ఉండడంతో వాహనచోదకులు ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో వాహనాలు నడిపేవారు. ప్రస్తుతం చెట్లు తొలగించడం ద్వారా రాకపోకలు సవ్యంగా జరుగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉపసర్పంచ్ పి.మాల్యాద్రి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

సంగం: సంగంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, జెడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్ బుజ్జయ్య ముఖ్య అతిథి పాల్గొని గ్రంథాలయాల ఆవశ్యకత, వినియోగంపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మేకపాటి జన్మదిన వేడుకలు



మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న మర్రిపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు



అనుమసముద్రంపేట: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వరికుంటపాడు: మేకపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



కలిగిరిలో మాజీ ఎంపీ మేకపాటి జన్మదిన వేడుకలు



ఉదయగిరి: మేకపాటి జన్మదిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నేతలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించారు. మర్రిపాడు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు రాజమోహన్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, పొంగూరుకండ్రిక, పెగళ్లపాడు సర్పంచ్ గుర్రం తిరుపాలు, చెవుల ప్రణవి శ్రీనివాస్, బూదవాడ మాజీ సర్పంచ్ ముట్టుకుందు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఏఎస్‌పేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 79వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ జిల్లా రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీకి ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ షౌకాత్ ఆలీ, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సంధాని, జిలానీ, ప్రభాకర్‌రెడ్డి, అంబటి కోటిరెడ్డి, గోడా భాస్కర్‌రెడ్డి, సూరా శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

వరికుంటపాడు: నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఆదివారం నెల్లూరులోని ఆయన నివాసంలో పలువురు మండల వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, విరువూరు ఉప సర్పంచ్ పాలకొల్లు భాస్కరరెడ్డి కలిసి మేకపాటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

కలిగిరి: కలిగిరిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మూలి రాఘవరెడ్డి, బాపతి శ్రీనివాసులురెడ్డి, ఖాజా మెయినుద్దీన్, వేమనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, రవి, ప్రసన్న, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి 79వ జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉదయగిరి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పొరుదల కాలువ తూములు ధ్వంసం



పెద్ద కాలువ తూము ధ్వంసమైన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని పెద్ద కాలువ, పుల్లయ్యగారి కాలువలను పూడికతీసే క్రమంలో భాగంగా తూములను ధ్వంసం చేశారని ఆ ప్రాంత రైతులు వాపోయారు. వారం రోజులుగా రెండో కారు సాగు కోసం కొన్ని కాలువల్లో పూడిక తీత పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో యంత్రం సాయంతో పూడికతీత పనులు జరుగుతుండగా పెద్ద కాలువ, పుల్లయ్యగారి కాలువ పూడిక పనుల అనంతరం వెలుపలకి వస్తున్న ఆ యంత్రం తూములు మీదుగా ఎక్కడంతో అవి ధ్వంసమయ్యాయి. దీంతో పలు కాలువలకు నీరు పంపిణీ అయ్యేందుకు సమస్య ఏర్పడింది. వాటిని తిరిగి మరమ్మతులు చేయిస్తామని నిర్వాహకులు తెలిపినా అనంతరం పట్టించుకోలేదని స్థానిక రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి రైతుల ఇబ్బందులను గుర్తించి సాగునీరు సక్రమంగా విడుదల అయ్యేలా తాత్కాలిక ఏర్పాట్లు అయినా చేయాలని రైతులు కోరుతున్నారు.